సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

గురువారం । 10 । ఆగస్టు । 2023



డిగ్రీ..నో డిమాండ్

కేయూ పరిధిలో వివిధ రకాల డిగ్రీ కోర్సులు ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం డిగ్రీ మొదటి సంవత్సరంలో 35శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. - 8లో▸



గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షం

గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0⁰ /26.0⁰

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సింగరేణి కార్మికుల నిరసన



భూపాలపల్లి అర్బన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా బుధవారం ఏరియాలోని సింగరేణి గనుల వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏరియాలోని కేటీకే 6వ గనిలో జరిగిన నిరసన కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంపేటి రాజయ్య హాజరై మాట్లాడారు. కోల్ ఇండియా వాటాలను కేంద్ర ప్రభుత్వం వేలం వేసిందని దీంతో రాష్ట్రంలోని సత్తుపల్లి, పెనగడప, శ్రావణపల్లి, కేకే–6 బ్లాక్‌ను ప్రైవేట్‌కు అప్పగిస్తుందన్నారు. కార్మిక చట్టాలను సవరించి 4 కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి జిల్లా కేంద్రంలోని సాయి రత్న ఆస్పత్రి, లక్ష్మి స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు బుధవారం రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. డాక్టర్ స్నిగ్ధసంస్కృతి, డాక్టర్ రజిత రెడ్డిలు రూ.లక్ష చొప్పున ఆలయ నిర్వాహకులు, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతికి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపులో నగదును అందజేశారు.

ప్లాంటేషన్ పనుల పరిశీలన



మల్హర్: మండలంలోని తాడిచర్ల సెక్షన్ పరిధిలోని శాత్రాజ్‌పల్లిలో 30 హెక్టార్ల చేపట్టిన ప్లాంటేషన్ పనులు, రుద్రారం గ్రామంలోని 10 హెక్టార్లలో నూతంగా చేపడుతున్న ప్లాంటేషన్ పనులను చీఫ్ కన్జర్వేటర్ సీపీ వినోద్‌కుమార్ బుధవారం పరిశీలించారు. నాటిన మొక్కలను సంరక్షించి, అడవుల శాతాన్ని పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలంలోని కొయ్యూరు రేంజ్ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన సెక్షన్ అధికారుల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌ఓ భూక్య లావణ్య, ఎఫ్‌డీఓ కృష్ణప్రసాద్, కొయ్యూరు రేంజర్ కిరణ్‌కుమార్, డిప్యూటీ రేంజర్ కొమరయ్య, సెక్షన్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, ఇంతియాజ్, బీటీ అధికారులు పాల్గొన్నారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్: మండలంలోని సురారం గ్రామంలో 10 హెక్టర్ల ప్లాంటేషన్, బొమ్మపూర్‌లోని 15 హెక్టర్ల ప్లాంటేషన్ పనులు బుధవారం సీఎఫ్‌ఓ వినోద్ కుమార్ పరిశీలించారు. అనంతరం సురారంలోని దళితులు సాగు చేసుకుంటున్న భూమిని అధికారులు ప్లాంటేషన్ కోసం చదును చేస్తున్నారని, దీనిని విరమించుకోవాలని సీఎఫ్‌ఓను దళితులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దళితులతో సీఎఫ్‌ఓ మాట్లాడుతూ కొత్తగా అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలపడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో డీఎఫ్‌ఓ లావణ్య, ఎఫ్‌డీఓ వజ్రరెడ్డి, ఎఫ్‌ఆర్‌ఓ కమల పలిమేల, మహదేవపూర్ రేంజ్ అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరంలో బైక్‌ర్యాలీ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పోస్టాఫీస్ పరిధిలో 'హర్‌ఘర్ తిరంగా 2.0'లో భాగంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. బుధవారం కాళేశ్వరముక్తీశ్వస్వామి ఆలయం నుంచి అంతర్రాష్ట వంతెన వరకు జాతీయజెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సబ్‌డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అజహరుద్దీన్ పాల్గొని ప్రతి పోస్టాఫీసులో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయని, రూ. 25లు చెల్లించి జెండాను పొందవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకునే అవకాశం ఉందని, బుక్ చేసుకున్న మరుసటి రోజే పోస్టుమ్యాన్ ద్వారా ఇంటికి డోర్ డెలివరీ చేస్తామన్నారు. ఆయన వెంట సర్పంచ్ వసంత, ఈఓ మహేష్, ఆలయ ధర్మకర్తలు రాంరెడ్డి, సమ్మయ్య, మెయిల్ ఓవర్సీర్స్ బుర్రి శ్రీనివాస్, రాజు, రంజిత్ ఉన్నారు.

రైతు రుణమాఫీకి మోక్షం



జిల్లాలో 60,601 మంది రైతులకు లబ్ధి
- 2018 డిసెంబర్ 11 నాటికి రుణం తీసుకున్న వారు అర్హులు
- హర్షం వ్యక్తం చేస్తున్న కర్షకులు



భూపాలపల్లి రూరల్: సుదీర్ఘ కాలం నిరీక్షణ అనంతరం ప్రభుత్వం అన్నదాతల రుణ విముక్తికి మోక్షం లభించింది. ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఎట్టకేలకు పంట రుణాల మాఫీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2018 డిసెంబర్ 11 నాటికి రుణం తీసుకున్న రైతులు రుణమాఫీకి అర్హులు కాగా మొదటి విడతలో రూ.25వేల లోపు రుణం ఉన్న రైతులకు మాఫీ చేశారు. మిగతా రైతులు రుణమాఫీ ఎప్పుడో అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూశారు. రైతులు ఆశించిన విధంగానే సీఎం ఆదేశించడంతో ఈ నెల 2వ తేదీ నుంచి రుణమాఫీ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.

జిల్లాలో 60,601 మంది అర్హులు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించగా నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని ప్రకటించింది. రూ.25 వేలలోపు రుణం తీసుకున్న రైతులకు ఒకసారి రూ.50 వేలలోపు మరోసారి రూ.75 వేలు, రూ.లక్ష చివరిసారి ఇలా నాలుగు విడతలుగా మాఫీ ప్రక్రియ పూర్తి కావాలి. కానీ జిల్లాలో కేవలం రూ.25వేల లోపు రుణం తీసుకున్న వారికి మాత్రమే మొదటి విడత మాఫీ చేశారు. రూ.25వేల రుణాలు తీసుకున్న వారిలో ఇప్పటికే 3,744 మంది రైతులకు రూ.5.19 కోట్లు రుణమాఫీ అయినట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. అనంతరం జిల్లాలో రూ.లక్షలోపు ఉన్న వారు 60,601 మంది రైతులు రుణమాఫీకి అర్హులని ఆయా బ్యాంకులు తేల్చాయి. దీంతో సుమారుగా 360.28 కోట్లు మాఫీ కానున్నాయి.

వడ్డీ డబ్బులు తిరిగొచ్చేనా?

జిల్లా వ్యాప్తంగా కర్షకులు రుణ మాఫీ కోసం నిరీక్షించారు. ప్రభుత్వం నాలుగు విడతల్లో మాఫీ చేస్తుందని ప్రకటించడంతో చాలా మంది రుణాలు తిరిగి చెల్లించలేదు. వడ్డీ డబ్బులు కడుతూ వచ్చారు. ధాన్యం డబ్బులు ఖాతాలో జమ కావడంతో బ్యాంకర్లు వాటిని రుణానికి మిత్తికింద జమ చేశారు. జిల్లాలో 50 శాతం మంది రైతుల పరిస్థితి ఇలానే ఉంది. 2019లోనే పూర్తిగా రుణమాఫీ జరగాల్సి ఉండగా కొంతమంది రైతులు నాలుగేళ్లుగా వడ్డీ డబ్బులు చెల్లించి రెన్యువల్ చేసుకున్నారు. ఈ క్రమంలో సదరు వడ్డీ డబ్బులు కూడా రైతుల ఖాతాలో జమ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే మాఫీ చేసినా పెద్దగా ఒరిగేదేమిలేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

వడ్డీ కూడా మాఫీ చేయాలి



ప్రభుత్వం రుణ మాఫీ చేస్తుందని రైతులెవరు బ్యాంకులకు రుణాలు చెల్లించలేదు. 2018 డిసెంబర్ 11 రోజే ప్రభుత్వం రుణాలు మాఫీ చేస్తే వడ్డీ కట్టే ఇబ్బంది లేకుండా ఉండేది. నాలుగేళ్లుగా వడ్డీకి వడ్డీతో బ్యాంకు అధికారులు రెన్యువల్ చేసి పెంచడంతో రుణాలు రెండింతలయ్యాయి. అసలు రూ.లక్షతో పాటుగా నాలుగేళ్ల వడ్డీ కూడా మాఫీ చేస్తేనే రైతులను ఆదుకున్నట్లు ఉంటుంది.

- ఆకుతోట తిరుపతి, రైతు, రేగొండ

కొత్త రుణాలిప్పించాలి..



రూ.50 వేల రుణం తీసుకున్న. బ్యాంకు అధికారులకు నాలుగేళ్లుగా వడ్డీ కడుతూ రెన్యువల్ చేసుకున్న. రూ.50 వేలకు రూ.40 వేల వడ్డీ పెరిగింది. ఇప్పుడు ప్రభుత్వం 2018 వరకు ఉన్న రుణాన్ని మాఫీ చేస్తే మళ్లీ నేను వడ్డీ కట్టాల్సిందేనా? అందుకు ప్రభుత్వం 2018 నాటి నుంచి అసలుతో పాటు వడ్డీ కూడా మాఫీ చేసి రైతులకు కొత్త రుణాలు ఇప్పించాలి..

- నారగోని ఎల్లస్వామి, రైతు ధర్మారావుపేట, గణపురం

ఎన్నికల కోసమే...



రాబోయే ఎన్నికల కోసమే రైతుల రుణ మాఫీ అంటూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త నాటకం ఆడుతోంది. రూ.లక్ష మాఫీతో రైతులకు ఒరిగిందేమిలేదు. నాలుగేళ్లుగా వడ్డీ ఎక్కువ అయింది. అసలుతోపాటు వడ్డీ కూడా మాఫీ చేస్తేనే ఫలితం ఉంటుంది. బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

- వెన్నంపల్లి పాపయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

క్రీడల్లో భూపాలపల్లి ముందుండాలి

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: యువత దురలవాట్లకు పోకుండా వ్యాయామం, క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గండ్ర హరీష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ క్రీడల పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుతున్న కాలంలో సగటు మనిషి వ్యాయామంపై శ్రద్ధ చూపాలని కోరారు. క్రీడల్లో క్రీడాకారులకు గెలుపు ఓటములు సహజమేనని, ఓడినవారు మళ్లీ గెలుపు దిశగా అడుగువేయాలన్నారు. రాబోయే రోజుల్లో ఆరోగ్యంగా ఉంటాలంటే శారీరక వ్యాయామం, క్రీడల్లో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫుట్‌బాల్ క్రీడాకారులను అభినందించి, ఆటను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు, వైస్ చైర్మన్ హరిబాబు, జిల్లా స్పోర్ట్స్ అధికారి సునీత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, ప్రజాప్రతినిధులు జనార్దన్, సాంబమూర్తి, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జిల్లాలో పూర్తి స్థాయిలో కార్యాలయాలు

జిల్లా కేంద్రంలో పూర్తి స్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా సహాయ కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కలెక్టర్ భవేష్‌మిశ్రాలు హాజరై మాట్లాడారు. జిల్లాలో సింగరేణి, జెన్కో, లారీ అసోసియేషన్‌లో కార్మికుల సంఖ్య అధికంగా ఉన్నారని, వారి సంక్షేమం కోసం కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ శ్యామల్, అసిస్టెంట్ లేబర్ అధికారిణి వినోద, నాయకులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు క్రీడాపోటీలు

భూపాలపల్లి అర్బన్: సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లో జాతీయ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా స్పోర్ట్స్ అధికారిణి బుర్ర సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సివిల్ సర్వీసెస్ (ప్రభుత్వ) ఉద్యోగులకు అఖిల భారత సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొనే వారు 16వ తేదీలోపు డీవైఎస్‌ఓ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8328577652 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

డీఎంహెచ్‌ఓ శ్రీరాం

మల్హర్: ప్రజలకు అన్ని సమయాల్లో వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ శ్రీరాం అన్నారు. మండలంలోని తాడిచర్ల ఆస్పత్రిని డీఎంహెచ్‌ఓ శ్రీరాం బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులను, మందులను పరిశీలించారు. అనంతరం సమావేశం నిర్వహించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజన్‌ల వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని, ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 24 గంటల ఆస్పత్రి నిర్వాహణకు మరో వైద్యాధికారి (రుద్రారం పల్లె డాక్టర్)ని నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీరాం

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు




మాట్లాడుతున్న ఎస్పీ కరుణాకర్

- ఎస్పీ కరుణాకర్
- ఘనంగా జిల్లా యువజనోత్సవాలు

భూపాలపల్లి అర్బన్: యువత మంచి అలవాట్లను అలవర్చుకుంటూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్పీ కరుణాకర్ విద్యార్థులకు సూచించారు. నెహ్రూ యువజన కేంద్రంలో ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవ కార్యక్రమం జిల్లా యువజన కేంద్ర అధికారి చింతల అన్వేష్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా ఎస్పీ కరుణాకర్ హాజరై మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని దాని సాధనకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. జీవితంలో క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తూ, సామాజిక, సేవ, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. జిల్లాలో యువతకు, విద్యార్థులకు జిల్లా పోలీస్ యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు అంశాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్యాంప్రసాద్, కాకతీయ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ నారాయణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్యామల, గ్రంథాలయ చైర్మన్ బుర్ర రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్దు, లెక్చరర్లు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

మారథాన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

భూపాలపల్లి అర్బన్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం, మారి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగే 5కే మారథాన్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఎంపిక చేసినట్లు మారి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సదానందం తెలిపారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం, మారి సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులచే 'యూత్ ఫెస్ట్ – 2023'లో భాగంగా 'రేస్ అగెనెస్ట్ హెచ్‌ఐవీ–రెడ్ రన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సదానందం పాల్గొని విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. జిల్లా మారథన్‌లో పాల్గొన్న వారిలో శివాణి, రేణుక, రాజ్‌కుమార్‌ను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్యాంప్రసాద్, ఇంటర్ విద్య నోడల్ అధికారి దేవరాజం, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రోహిణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారిణి సంధ్యారాణిలు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

బతుకమ్మ ఆడి ఏఎన్‌ఎంల నిరసన

భూపాలపల్లి అర్బన్: వైద్యారోగ్యశాఖలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట బతుకమ్మ చుట్టూ ట్యాబ్‌లు పెట్టి బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజ్ సతీష్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రజల ప్రాణాలు నిలపడానికి ఏఎన్‌ఎంల ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ ప్రతిపాదికన పని చేస్తుంటే వారిని రెగ్యులర్ చేయకుండా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, ఏఎన్‌ఎంలు సుగుణ, వెంకటేష్, ప్రవీణ్, శ్రీకాంత్, కృష్ణవేణి, సాధన, పార్వతి, మమతలు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడి నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తిచేయాలి

- కలెక్టరేట్, మెడికల్ కళాశాల నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనం, మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్, మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. సమీకృత కలెక్టరేట్ పనులను పరిశీలించిన కలెక్టర్ నిర్మాణ పురోగతిపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమీకృత కలెక్టరేట్ చివరి పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, వర్షాలు తగ్గి 10 రోజులు గడిచినప్పటికీ పనుల్లో వేగం పెరగలేదన్నారు. 15 ఎకరాల్లో రూ.59.45 కోట్ల వ్యయంతో కలెక్టరేట్ భవన నిర్మాణం చేపట్టిందని, నిధులకు సమస్యలు లేనందున పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన మేర అదనపు కార్మికులను ఏర్పాటు చేసి త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో రోడ్ల నిర్మాణం పూర్తి కావాలని శాఖల వారీగా నేమ్ బోర్డులు, పార్కింగ్ బోర్డులు ఇతర ఏర్పాట్లు ఫర్నిచర్ ఏసీల బిగింపు లిఫ్ట్ వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. అవగాహనకు పెద్దపల్లి, హనుమకొండ జిల్లాలోని కలెక్టరేట్లను సందర్శించి ప్రణాళిక రూపొందించుకుని పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించే నేపథ్యంలో నిర్మాణ పనుల్లో వేగం పెంచి మెడికల్ మొదటి సంవత్సర విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా పూర్తి చేయాలన్నారు. ఇటీవల ఇండియన్ మెడికల్ బోర్డు న్యూఢిల్లీ వారు 100 ఎంబీబీఎస్ సీట్లతో మెడికల్ కళాశాలకు అనుమతి మంజూరు చేయడం జరిగినందని, సెప్టెంబర్ నుంచి తరగతులు ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. నిర్మాణ పనులపై ప్రతి రోజు రివ్యూ నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సకాలంలో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇంజనీర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

నిధులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం పోషణ వాటిక సాక్ష్యం అంగన్‌వాడీ కింద పోషన్ వాటికలకు అందించే నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశించారు. బుధవారం కలెక్టర్ భవేష్‌మిశ్రా తన చాంబర్‌లో సాక్ష్యం (సంక్షేమ) అంగన్‌వాడీలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాక్ష్యం (సంక్షేమ) అంగన్‌వాడీ కింద జిల్లాలో 31 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ వాటికలు, 50 అంగన్ వాడీ కేంద్రాల్లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, 50 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, 12 అంగన్‌వాడీలో ఎల్‌ఈడీ లైట్లు, 12 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ శైలజ, జిల్లా ఉద్యానవన అధికారి సంజీవరావు, సీడీపీఓలు డీఆర్‌డీఓ, మిషన్ భగిరథ, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు




ఆర్థిక సాయం అందిస్తున్న సుదర్శన్ రావు

భూపాలపల్లి రూరల్: పేదలకు ఎర్రజెండా ఎప్పుడూ అండగా ఉంటుందని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతునేని సుదర్శన్‌రావు అన్నారు. సీపీఎం పార్టీ జిల్లా కమిటీ, మాకినేని బసవ పున్నయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చనిపోయిన కుటుంబాలకు రూ.5,000 చొప్పున ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమానికి పోతినేని సుదర్శన్ రావు ముఖ్యఅతిథిగా హాజరై గ్రామస్తులను పరామర్శించారు. అనంతరం సుదర్శన్ రావు మాట్లాడుతూ మోరంచపల్లి గ్రామానికి ఆకస్మాత్తుగా వచ్చిన వరదలతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుల చట్టం కింద ఈ గ్రామాన్ని చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం దేవేందర్,నాయకుల వెలిశెట్టి రాజయ్య, ప్రీతి, శ్రీకాంత్, రవి, వంగాల లక్ష్మి ,కోమల, శ్రీలత, సుజాత పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమానికి కృషి చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి రాజేందర్

కాటారం: ఆదివాసీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, వైద్య, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అభివృద్ధి సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను బుధవారం కాటారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలిలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుండపు రమేశ్, తైనేని సతీశ్, దయ్యం వినోద్, శ్రీను, శరత్, చిన్న రాజేందర్, కిరణ్, స్వామి, నరేశ్, సమ్మయ్య పాల్గొన్నారు.



కాటారం: జెండావిష్కరణలో పాల్గొన్న ఆదివాసీలు

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు.

భూపాలపల్లి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ హక్కులను ఉల్లంగిస్తూ, ఆదివాసీలను అడవుల నుంచి తరిమేయాలనే కుట్రతో వారిపై అనేకదాడులు చేస్తున్నారని రైతు స్వరాజ్యవేదిక జిల్లా కన్వీనర్ కర్నాటకపు సమ్మయ్య బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. అడవుల నుంచి ఆదివాసీలను గెంటివేయాలని ప్రయత్నించడం మానవహక్కుల ఉల్లంగనేనని ఐక్యరాజ్యసమితి పేర్కొందన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

భూపాలపల్లి అర్బన్: జిల్లా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న అంబులెన్స్ డ్రైవర్, ఈఎంటీల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో రెండు ఈఎంటీలు, ఇద్దరు డ్రైవర్లను నియమించడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన డ్రైవర్లు సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి



మాట్లాడుతున్న శ్రీకాంతారావు

హన్మకొండ కల్చరల్ : దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, ఆ భూములను నిబంధనల మేరకు కౌలుకు ఇచ్చి వచ్చిన ఆదాయం బ్యాంక్‌లో జమచేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీకాంతారావు ఆదేశించారు. బుధవారం పాత సెంట్రల్ జైల్ ఎదుట గల దేవాదాయ శాఖ (ధార్మిక భవన్) కార్యాలయంలో ధూప దీపనైవేద్య పథకం ద్వారా లబ్ధిపొందుతున్న అర్చకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 200మంది అర్చకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంతారావు.. అర్చకులు, దేవాదాయశాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. దేవాలయంలో సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, పర్యవేక్షకులు వీరస్వామి, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ.. నో డిమాండ్

కేయూ డిగ్రీ కళాశాలల్లో సగం కూడా భర్తీ కాని సీట్లు

- 287 కళాశాలల్లో మొత్తం 98,980 సీట్లు
- 34,959 సీట్లు మాత్రమే భర్తీ.. 64,021 ఖాళీ
- ఇక స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ, కంప్యూటర్ కాంబినేషన్‌లతో పాటు వివిధ రకాల కోర్సులు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో 2023–2024లో ఆయా డిగ్రీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు గాను ఇప్పటి వరకు మూడు దశల్లో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ద్వారా సీట్లు కేటాయింపులు జరిగాయి. యూనివర్సిటీ పరిధిలో ఉన్న సీట్లల్లో సగం కూడా భర్తీకాలేదు. కేవలం 35శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కళాశాలలు కలిపి 267 ఉన్నాయి. అందులో వివిధ డిగ్రీ కోర్సులన్నీ కలిపి మొత్తం 98,980 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది మే నుంచి జూలై వరకు మూడు దశల్లో అడ్మిషన్ల ప్రక్రియ జరిగింది. మొదటి దశలో కేయూ పరిధిలోని కళాశాలలకు 16,078 సీట్లు కేటాయించగా అందులో 10,678 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ తరువాత జరిగిన రెండోదశలో 11,112 సీట్లు కేటాయించగా 8,342 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ తరువాత మూడోదశలో 18,076 సీట్లు కేటాయించగా 15,939 మంది విద్యార్థులు కళాశాలల్లో చేరారు. మూడు దశల్లో నిర్వహించిన డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియలో మొత్తం 45,266 సీట్లు కేటాయించగా 34,959 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కేవలం 35శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంకా 64,021 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

స్పెషల్ ఫేజ్‌కు అడ్మిషన్ల ప్రక్రియ షురూ..

రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలకుగాను మూడు దశలు ముగిసినా వివిధ యూనివర్సిటీల పరిధిలో సీట్లు చాలా మిగిలాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి దోస్త్ ద్వారా స్పెషల్ ఫేజ్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియకు షెడ్యూల్ జారీ చేసింది. ఈ నెల 7వతేదీ నుంచి స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ అయింది. ఈ నెల 13వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. సోమవారం నుంచి ఈనెల 14వ తేదీవరకు వెబ్ ఆప్షన్‌లు ఇచ్చుకోవాలి. ఈనెల 17న సీట్లు కేటాయింపు జరగనుంది. స్పెషల్ ఫేజ్ నిర్వహించినా కూడా సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యే పరిస్థితి కనపడడంలేదు. ఇంటర్ పూర్తికాగానే ఎక్కువశాతం మంది విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులతోపాటు దూర ప్రాంతాల రాష్ట్రాలకు తరలివెళ్తున్నారు. దీంతో సంప్రదాయ డిగ్రీ కోర్సులకు ఆదరణ తగ్గిపోతుంది. డిగ్రీలో కూడా పలు కొత్త కోర్సులు ప్రవేశపెట్టినప్పటికీ వాటికి కూడా ఆదరణ అంతగా ఉండడం లేదనే సీట్ల భర్తీని బట్టి తెలుస్తోంది. మరోవైపు డిగ్రీలోనూ గురుకులాల సంఖ్య పెంపుదల చేశారు. దీంతో గురుకులాల్లో చేరడంతో ఆ ప్రభావం కూడా ఇతర కళాశాలపై పడిందని భావిస్తున్నారు. మరోవైపు గత విద్యాసంవత్సరంలో విద్యార్థులు అసలే లేని కళాశాలలకు ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దోస్త్‌లో కొన్నింటికి అవకాశం ఇవ్వలేదు. మరి కొన్నింటికి ఇచ్చారు. ఫలితంగా ఆయా కళాశాలల్లో సీట్లు భర్తీ ఈ విద్యాసంవత్సరంలోనూ అంతంత మాత్రమేనని సమాచారం.

మూడుదశల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో కేయూ పరిధిలో గత నెల 27నుంచే క్లాస్‌లు ప్రారంభమయ్యాయి. స్పెషల్‌ఫేజ్ అడ్మిషన్లకు అవకాశం ఇచ్చినా అంతంతమాత్రమే సీట్లు భర్తీ అయ్యే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షం



బోనం ఎత్తుకున్న మంత్రి దయాకర్‌రావు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో జరిగిన బోనాల వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. బోనం ఎత్తుకుని మహిళలతో కలిసి ముత్యాలమ్మ గుడిలో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించి నిరుద్యోగ యువతను మోసగించిందన్నారు. సీఎం కేసీఆర్ హామీ ప్రకారం 1.33 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశారని, 80 వేలకు పైగా ఖాళీలకు నోటిఫికేషన్లు ఇచ్చారని గుర్తు చేశారు. రూ.152 కోట్లతో తొర్రూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేయనున్నామన్నారు. సంక్షేమ పాలనతో ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, పట్టణాభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పాసుగోటి సోమేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాసరావు, దొంగరి రేవతి, నాయకులు కుర్ర శ్రీనివాస్, దొంగరి శంకర్, కర్నె నాగరాజు, జైసింగ్, పూలమ్మ పాల్గొన్నారు.

అవార్డు సాధనకు పోటీ పడాలి

- టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత
- 28 మంది ఉద్యోగులకు ప్రగతి చక్రాల పురస్కారం



ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు అందజేసి సన్మానిస్తున్న ఆర్‌ఎం శ్రీలత

హన్మకొండ: అవార్డు సాధనకు ఉద్యోగులు పోటీ పడాలని టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత అన్నారు. బుధవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో వరంగల్ రీజియన్ స్థాయి ప్రగతి చక్రాల పురస్కార ప్రదానోత్సవం జరిగింది. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన 28 మంది ఉద్యోగులకు ఆర్‌ఎం శ్రీలత నగదు అవార్డుతో పాటు ప్రశంస పత్రాలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపో, రీజియన్ స్థాయిలో కాకుండా రాష్ట్ర స్థాయి అవార్డు సాధించడంపై ఉద్యోగులు దృష్టి సారించాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉద్యోగులు సంతోషంగా ఉన్నారన్నారు. అయితే ప్రభుత్వంలో విలీనంతో ఉద్యోగులపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. వరంగల్ రీజియన్ లాభాల్లో నడిచేలా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కృపాకర్ రెడ్డి, మాధవరావు, ఈఈ భాస్కర్, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న ఉద్యోగుల వివరాలు...

వరంగల్–1 డిపో డ్రైవర్లు ఎ.రాజేందర్, టి.జె.సింగ్, కె.శ్యామ్, ఎం.శ్రీను, కె.వీరయ్య, భూపాలపల్లి డిపో డ్రైవర్లు కె.రాజేందర్, డి.కోటయ్య, పరకాల డిపో డ్రైవర్ టి.భిక్షపతి, వరంగల్–2 డ్రైవర్లు బి.పోచయ్య, ఎ.వెంకటయ్య, వరంగల్–2 డిపో కండక్టర్ బి.ఎస్.రావు, భూపాలపల్లి కండక్టర్ జి.సునీత, వరంగల్–1 డిపో కండక్టర్ జి.సుధాకర్, ఎస్.రమేష్, మహబూబాబాద్ కండక్టర్లు వీరన్న, వి.ఉమ, హనుమకొండ డిపో కండక్టర్లు ఎస్.రమేష్, ఎస్.కె.వై.పాషా, నర్సంపేట డిపో కండక్టర్లు బి.హరిసింగ్, బి.మహేందర్, టిమ్ డ్రైవర్లు కె.దినేష్‌కుమార్ (హనుమకొండ), టి.దేవేందర్ (హనుమకొండ), బి.సురేష్ (నర్సంపేట), ఎం.డి.షాహీద్ (నర్సంపేట), పి.ఆర్.రెడ్డి (నర్సంపేట), మెకానిక్‌లు టి.శంకరయ్య (వరంగల్–1), ఎం.సంజీవయ్య (వరంగల్–2), శ్రామిక్ ఎస్.సంపత్ కుమార్ (జనగామ) అవార్డులు అందుకున్నారు.

ఆయుర్వేద వైద్యకళాశాలలో అడ్మిషన్లకు అనుమతి

కాశిబుగ్గ: వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ విజయగణేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్(ఎన్‌సీఐఎస్‌ఎం) షరతులతో కూడిన అనుమతి ఇచ్చిందన్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ప్రవేశాల కోసం ఎన్‌సీఐఎస్‌ఎం తనిఖీలకు సహకరించిన ఆస్పత్రి సూపరింటెండెంట్, సిబ్బంది, ఫ్యాకల్టీ మెంబర్లు, కళాశాల సిబ్బంది, రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ హరిచందనకు కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ ఆస్తులు పరిరక్షించాలి



సెక్రటరీకి మొక్కను అందజేస్తున్న తన్వీర్

న్యూశాయంపేట: వరంగల్ జిల్లాలో వక్ఫ్ ఆస్తులు పరిరక్షించడానికి చర్యలు తీసుకుని ముస్లింల సమస్యలు పరిష్కరించాలని వరంగల్ వక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్, డెవలప్‌మెంట్ కమిటీ, ముస్లిం ప్రతినిధి బృందం కోరింది. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నేతృత్వంలో హైదరాబాద్‌లో మైనారిటీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ ఉమర్ జలీల్‌ను కలిసింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ వరంగల్ ఫోర్ట్‌రోడ్ లోని ఈద్గా అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ. కోటి 40 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధుల విడుదలకు వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ఈద్గా కమిటీ బాధ్యులు ఎం.ఏ.ఖాలీఖ్‌తన్వీర్, సాధిక్ అలీ, ఎం.ఎం. తహశీర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ఎస్‌ఎఫ్‌సీ విద్యార్థుల ధర్నా

- రెండోరోజూ కొనసాగింపు
- హాస్టల్ వసతి కల్పిస్తామని ప్రిన్సిపాల్, డైరెక్టర్ హామీ
- ఆందోళన విరమణ



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎస్‌ఎఫ్‌సీల విద్యార్థులు తమకు హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ రెండోరోజు కూడా బుధవారం ఉదయం 6 గంటల నుంచే గేట్ మూసివేసి ధర్నా చేశారు. మొదటి గేట్ మూసివేతతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీనిపై సమాచారం అందుకున్న యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి సురేష్ లాల్, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య వై వెంకయ్య మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఘటనా స్థలికి చేరుకున్నారు. వెంకయ్య మాట్లాడుతూ గత విద్యాసంవత్సరంలో ఏ ఎస్‌ఎఫ్‌సీకి సంబంధించిన విద్యార్థులకు కూడా హాస్టల్ వసతి కల్పించలేదన్నారు. అయినా కొందరు నాన్‌బోర్డర్లుగా ఉండడం సరికాదన్నారు. అన్ని ఎస్‌ఎఫ్‌సీల విద్యార్థులకు మరో 15 రోజుల్లో హాస్టల్ వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కాగా, ఆందోళనకు ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, బి రాకేష్ (ఎస్‌ఎస్‌యూఐ), మహేష్(పీడీఎస్‌యూ) తదితరులు మద్దతు తెలిపారు.

పసుపు ధర పైపైకి..

- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.13,221
- వరంగల్‌లో రూ.13వేలు..



కేసముద్రం మార్కెట్‌కు వచ్చిన పసుపు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపుకు రికార్డుస్థాయిలో రూ.13,221 ధర పలికింది. మార్కెట్‌లో పసుపు సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.5 నుంచి 6వేల వరకు పలుకగా, నెల రోజుల నుంచి ధర క్రమక్రమంగా పెరుగుతూవస్తోంది. ఈ మేరకు బుధవారం మార్కెట్‌కు 56 బస్తాల పసుపు అమ్మకానికి రాగా, కాడిరకం పసుపుకు గరిష్ట ధర రూ.13,221, కనిష్ట ధర రూ.8,651 పలుకగా, గోళారకం పసుపుకు క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.11,752, కనిష్ట ధర రూ.6,509 పలికినట్లు మార్కెట్ అధికారులు పేర్కొన్నారు. కాగా, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో రూ.13వేలు

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపు అత్యధికంగా క్వింటాల్‌కు రూ.13వేల ధర పలికింది. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన నూనె రాజయ్య మార్కెట్‌కు 20 బస్తాల పసుపు తీసుకొచ్చారు. పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు రూ.13వేలు, గోళా రకానికి రూ.12600 పలకిందని యార్డు ఇన్‌చార్జ్ సాగర్ తెలిపారు. ఈ పసుపును జెకె.ఎంటర్‌ప్రైజెస్ నుంచి ఓసాయి ట్రేడర్స్ కొనుగోలు చేసినట్లు తెలిపారు.

'ఏకపక్ష నిర్ణయాలు చెల్లుబాటు కావు'

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్‌హాల్‌లో నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) సర్వసభ్య సమావేశం చర్చలతోనే అర్థాంతరంగా ముగిసిందని, ఏకపక్ష నిర్ణయాలు అకుట్ పరిధిలోనికి రావని అధ్యక్షుడు ఆచార్య తౌటం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి , ఉపాధ్యక్షురాలు ఆచార్య బ్రహ్మేశ్వరి, జాయింట్‌సెక్రటరీ కిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న జరిగిన అకుట్ సర్వసభ్య సమావేశంలో కొందరు అధ్యాపకులు నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నారని, అవి చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. సమావేశంలో తీసుకునే నిర్ణయాలకు పూర్తి కోరం అవసరమన్నారు. అందుకే ఏకపక్ష నిర్ణయాలు చెల్లుబాటుకావన్నారు.

మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలగడ్డ ఈద్గాలో బుధవారం ఉదయం గత నెల 12న పూడ్చి పెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన షహనజ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమార్తె కాజోల్ (20)వీణాబజార్‌లో ఓ బట్టల షాపులో పనిచేస్తోంది. కాజోల్ అంబాల గ్రామానికి చెందిన అబ్బాస్‌తో ఆరు సంవత్సరాల నుంచి సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో పెండ్లి విషయంలో కాజల్, అబ్బాస్‌కు గొడవలు జరిగాయి. ఇదిలా ఉండగా అనారోగ్య కారణాల రీత్యా గత నెల 12న కాజోల్‌ను ఎంజీఎంలో అడ్మిట్ చేయగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అదే రోజు రాత్రి అబ్బాస్ బొక్కలగడ్డ ఈద్గాలో కాజోల్ మృతదేహం పూడ్చిపెట్టాడు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి షహనజ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి హనుమకొండ తహసీల్దార్ సమక్షంలో కేఎంసీ ఫోరెన్సిక్ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా నిందితుడిపై చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



రంజిత్‌కుమార్ (ఫైల్)

రాయపర్తి: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరంగల్ చార్‌బౌళి ప్రాంతానికి చెందిన కాదర్ల రంజిత్‌కుమార్ (35) నగరంలో బంగారం షాపు నిర్వహించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం విరివిగా అప్పులు చేశాడు. తీర్చే మార్గం కనిపించక సోమవారం సాయంత్రం హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతంలో ఎస్సారెస్పీ కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం కాల్వలో రాయపర్తి మండల కేంద్రంలోని గుబ్బడిబోడుకిందితండాకి కొట్టుకొచ్చింది. దీనిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని కాల్వ నుంచి బయటకు తీసి రంజిత్‌కుమార్‌గా గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం మృతదేహాన్ని నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య సుస్మిత, పాప, బాబు ఉన్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న ఒకరి మృతి

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ రెడ్డిపాలెం గ్రామానికి చెందిన తుపాకుల నూకాంబ్రం(60) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. నూకాంబ్రం మంగళవారం ఈత కొమ్మలు కోయడానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మొగిలిచర్ల బస్టాండ్ వద్ద వెనక నుంచి అతివేగంగా వచ్చిన కోళ్ల వ్యాన్.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆయనను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

స్కూల్‌బస్సును ఢీకొట్టిన జెడ్పీ ఫ్లోర్‌లీడర్ స్వప్న వాహనం

- ఏడుగురు విద్యార్థులకు తీవ్రగాయాలు.. ఒకరిని వరంగల్‌కు రెఫర్
- సకాలంలో రాని 108 వాహనం.. రోడ్డు వెంట వాహనాలు ఆపి తరలించిన స్థానికులు
- జెడ్పీ ఫ్లోర్‌లీడర్‌కు తీవ్రగాయాలు కావడంతో మరో వాహనంలో హనుమకొండకు తరలింపు



ప్రమాదానికి గురైన కారు, బస్సు..



తీవ్రంగా గాయపడిన మహేష్



ప్రమాదంలో గాయపడిన చిన్నారులు

నర్సంపేట రూరల్ : ఆగి ఉన్న స్కూల్ వ్యాన్‌ను వరంగల్ జిల్లా జెడ్పీ ఫ్లోర్ లీడర్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్న వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. అందులో ఒకరిని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌కు రెఫర్ చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ శివారులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణంలోని పాత్‌ఫైండర్ స్కూల్‌కు చెందిన ఇటుకాలపల్లి, నారక్కపేటకు రూట్ స్కూల్ బస్సు సాయంత్రం 5.20 గంటలకు 24 మంది పిల్లలతో బయలుదేరి వెళ్లింది. నారక్కపేట వైపు వెళ్లేందుకు 365 జాతీయ రహదారి వద్దకు చేరుకుంది. ముందు ద్విచక్రవాహనం ఉండడంతో డ్రైవర్ బస్సు నిలిపిఉంచారు. ఆ సమయంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి వరంగల్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న ఫార్చునర్ కారులో డ్రైవర్‌తో కలిసి ముత్తోజీపేట వైపు వేగంగా వస్తున్నాడు. ద్విచక్రవాహనాన్ని తప్పించపోయి కమలాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు వైపు తిప్పడంతో ఆ పక్కనే నిలిపివేసిన బస్సు వెనుకవైపు ఢీకొట్టారు. దీంతో బస్సు పల్టీ కొట్టే సమయంలో పక్కనే చెట్టు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులోని 19మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. పెద్ది స్వప్నకు కూడా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. 108 వాహనం సకాలంలో రాకపోవడంతో జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను ఆపి విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి 11మంది తరలించగా ముగ్గురికి తీవ్రగాయాలైన అన్విత్, కీర్తనలను ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. నల్లబెల్లి మండలం నారక్కపేటకు చెందిన ఎం. మహేష్‌కు ప్రాథమిక చికిత్స నిర్వహించి వరంగల్‌కు రెఫర్ చేశారు. మరో 8మందిని నర్సంపేట పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారిలో రిత్విక్, సహస్ర, నందు, దీక్షిత్‌లకు తీవ్రగాయాలు కాగా అడ్మిట్ చేశారు. మిగతావారికి చికిత్స అందించి తల్లిదండ్రులకు అప్పగించారు. నర్సంపేట ఏసీపీ తిరుమల్, టౌన్ సీఐ రవికుమార్, రూరల్ సీఐ కిషన్ ఆధ్వర్యంలో ప్రమాదంపై విచారణ జరుపుతున్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని విద్యార్థి సంఘాల నాయకులు పోలీసులను కోరారు.

హనుమకొండకు పెద్ది స్వప్న తరలింపు

ప్రమాదంలో గాయపడిన జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నను వెంటనే వేరే వాహనంలో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నట్లు సమాచారం.